


# భూమిపుత్రుడు

యర్రమిల్లి జె. శేఖర్

2090 డిసెంబర్ 31వ తేదీ. అది 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్ నేషనల్ సైంటిఫిక్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐ.ఐ.ఎస్.ఆర్.డి) కార్యాలయం, ముప్పై ఆరో అంతస్థులోని కాన్ఫరెన్స్ హాల్.

అన్ని ప్రముఖ దేశాల ప్రధాన కార్యదర్శులు ఆ సమయంలో అక్కడ సమావేశమై ఉన్నారు. వాళ్ల ఎదురుగా ఉన్న మానిటర్ స్క్రీన్ మీద ఇంటర్ ప్లానెటరీ రీసెర్చ్ రాకెట్ ఎ-1 (ఐ.పి.ఆర్.ఆర్-ఎ1) తొమ్మిదో గ్రహమైన ప్లూటో మీదికి దిగటం త్రీడిలో కనబడుతోంది.

అందరూ ఊపిరి బిగబట్టి చూస్తున్నారు. ప్లూటో ఉపరితలం మీద ఐ.పి.ఆర్.ఆర్.-ఎ1 నెమ్మదిగా దిగింది.

మరుక్షణం ఆ గది తప్పట్లతో, 'కంగ్రాట్యులేషన్స్,' అన్న అరుపులతో మారుమోగింది.

మనిషి మరో విజయపతాకం పాతాడు. అదే సమయంలో ఎవరో పిచ్చివాడు అదేపనిగా నవ్వడం ప్రారంభించాడు.

*

'ఉదయ్' తన 'గార్గా 3000' మీద వినువీధుల్లో రివ్వున సాగిపోతున్నాడు.

ప్రస్తుతం ఉన్న స్పేస్‌షిప్స్ అన్నింటిలోకి గార్గా 3000 ఒక్కటే టు సీటర్, అతి చిన్నదీను. ప్రస్తుతానికి తనకొక్కడికి ఇది సరిపోతుంది. మాయని వివాహం చేసుకున్న తరువాత ఆరుగురికి సరిపోయే 'ట్రిపుల్ డబుల్' కొనాలని ఆలోచిస్తున్నాడు. ముందు ముందు ప్రభుత్వానుమతితో పుట్టబోయే బిడ్డక్కూడా అదయితే వీలుగా ఉంటుంది. అప్పుడు మాయను చంద్రుడి మీద దింపేసి తను శుక్రుడి మీద కొచ్చెయ్యొచ్చు.

ఉదయ్ వెళ్లే దారికి అటూఇటూ వరుసగా సెట్ లైట్లు కాంతివర్షం కురిపిస్తున్నాయి. దారంతా వెలుగులు చిమ్ముతోంది. ట్రాఫిక్ రూల్సుని పాటిస్తూ జాగ్రత్తగా తన గార్గాని నడుపుతున్నాడు ఉదయ్. చాలా కఠినమైన పరీక్షల అనంతరం కానీ వినువీధుల్లో వాహనాలు నడపడానికి లైసెన్స్ ఇవ్వరు. అతని స్పేస్‌షిప్‌ని ఏ పరిస్థితులలోనూ అతనే బాగుచేసుకోగలిగి ఉండాలి. అలాంటి వారికే ఈ లైసెన్స్ ఇవ్వబడుతుంది. ఉదయ్ చార్మినార్ ర్యాలీలో ఒకసారి ద్వితీయ బహుమతి గెలుచుకున్నాడు కూడాను.

2030 నాటికే భూమి మీది వాతావరణం పూర్తిగా కలుషితమైపోయింది. ఫ్యాక్టరీల నుంచి వచ్చే వేడికి, పొగలకి విధివిధానాలయిన రసాయనిక చర్యలవల్ల వచ్చే మార్పులకు వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ నిష్పత్తులు అధికమవడంతో ఉష్ణోగ్రత పెరిగి నీటికొరత ఏర్పడింది. అనంత విశ్వంలో భూమి సజీవపాత్ర ముగిసే దశ వచ్చిందని శాస్త్రజ్ఞులు భయపడిపోయారు.

ఉదయ్ చిన్నగా నవ్వుకున్నాడు. మనిషి మేధస్సును భగవంతుడనేవాడు తక్కువగా అంచనా వేశాడు. మళ్లీ మనిషే గెలిచాడు.

ఆక్సోజనట్స్, కాంపాక్స్ సెరాల్స్ కనుక్కోబడ్డాయి.

ఆక్సోజనట్స్ అవతరించడంతో ఇతర గ్రహాలలో మరీ కార్బన్ డయాక్సైడ్ పొగలతోటీ, మంచు గుట్టల తోటి ఉండే గ్రహాలతో సహా వాతావరణ నిష్పత్తులని సూర్యుడి నుంచి ఆయా గ్రహాల దూరాలకు అనుగుణంగా మార్చడం జరిగింది.

నిజానికి చంద్రుడు అనే ఉపగ్రహమూ, శుక్ర గ్రహమూ నివాసయోగ్యంగా రూపుదిద్దుకున్నాయి.

అయితే భూమి మీదలా చొక్కా విప్పుకు తిరగడానికి లేదు. ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన సూట్ వేసుకొనే వుండాలి. ఆక్సిజన్ మాస్క్‌తో సహా!

ఆక్సిజన్ సిలెండర్లని మోసే బాధ కూడా తప్పింది. ఓ ప్రముఖ కెమికల్ కంపెనీ ఆక్సోజనట్స్‌ను మాత్రలుగా చేసి ఆక్సోజిల్స్ అనే పేరుతో విడుదల చేసింది. ఆ ఆక్సోజిల్స్ ఓ డజను జేబులో వేసుకునిపోతే ఒక వారం దాకా, అవి అన్నీ పూర్తిగా కరిగిపోయేదాకా బెంగలేదు.

ఉదయ్ సూటులోపలి చొక్కాజేబులో తడుము కున్నాడు. గుండె దిగ్గుమంది. సాధారణంగా రెండు డజన్ల ఆక్సోజిల్స్‌ను మర్చిపోకుండా తెచ్చుకుంటాడు. కాని ఇప్పుడు ఒకే ఒక ఆక్సోజిల్ ఉంది జేబులో. అయినా ఫరవాలేదు. రెండుమూడు గంటలలో తిరిగి భూమి మీదకు వెళ్లిపోతాడతను.

కుడిచేత్తో స్పేస్‌షిప్ వేగాన్ని పెంచే లివర్‌ని బలంగా లాగాడు. గార్గా 3000 గుర్ర్‌మంటూ వేగంగా ముందుకు దూకింది. రెండు ప్రక్కలా వెలుగులు చల్లుతున్న సెట్‌లైట్స్, వేగంగా వెనక్కు కదిలిపోతున్నాయి.

తనలో తానే నవ్వుకుంటూ ఉదయ్ బ్యాటరీ క్యాబిన్‌వేపు అప్యాయంగా చూశాడు.

అసలు ఆక్సోజనట్స్ కన్నా ముఖ్యంగా చెప్పుకోవలసింది కాంపేక్ట్ పవర్ సెల్. అది ఎంత చిన్నదంటే, దాని మొత్తం పరిమాణం ఒక సాధారణమైన మనిషి అరచెయ్యంత. అయితే దాని శక్తి 1969-2001ల మధ్య లాంచ్ చెయ్యబడ్డ రాకెట్ల మొత్తానికి సమానం. అందువల్లనే చిన్నచిన్న గార్గా 3000 లాంటి టు సీటర్లు కూడా అతి సునాయాసంగా శుక్రగ్రహానికి పొద్దున్న వెళ్లి సాయంకాలం రాగలుగుతున్నాయి. మానవుడి మేధస్సు తలుచుకొన్నకొద్దీ ఉదయ్‌కు ఎంతో గర్వంగా అనిపించింది.

ఉదయ్ ఆలోచిస్తున్న వాడల్లా ఎదురుగా రెడ్ సెట్‌లైట్ కనబడేసరికి ఉలిక్కిపడ్డాడు. రెడ్ సెట్‌లైట్స్ అనేవి దారిలో ఏవో అవాంతరాలు ఉన్నా, లేక స్పేస్‌షిప్ వెళ్లేదారి తప్పుదారయినా ఎదురుపడే సెట్‌లైట్స్.

ఉదయ్ గార్గా 3000ని నెమ్మది చెయ్యడానికి బ్రేక్ లివర్‌ని బలంగా లాగాడు. గార్గా వెళ్లే వేగం కొంత తగ్గింది, అయినా అతనికి తెలిసిపోయింది. తను తిన్నగా వెళ్లి రెడ్ సెట్‌లైట్‌కి గుద్దుకోవడం తథ్యం, అంతే ఇంకేముంటుంది...?

గార్గాని సర్రుని ఎడమచేతివైపు తిప్పాడు. కొంత దూరం అదే వేగంతో వెళ్లిన గార్గా 3000 ఆగిపోయింది దేనికో గుద్దుకున్నట్టు. లోపల, బయట అంతా అంధకారం. కాలు దేనికో గుద్దుకుని విరిగిపోయినంత బాధ పెట్టింది. చేత్తో తడిమి చూశాడు.

స్పేస్‌సూట్ అడ్డుకుంది. అదీ ఒకందుకు మంచిదే. ఎముక విరిగినా కాలుని ఒకేవిధంగా పట్టి ఉంచుతుంది.

కాలుని వెనక్కు లాగడనాకి శరీరాన్ని వెనక్కు జరిపి ప్రయత్నం చేశాడు. కరేలుమని నొప్పి గుండెల్లోకి తన్నింది. ఆ ప్రయత్నం విరమించుకుని దీపం వెలిగించడానికి స్విచ్‌లు వెయ్యసాగాడు.

ఒక్క దీపమూ వెలగలేదు. అతను దాని గురించి కంగారుపడకుండా, సవ్యసాచిలా పనిచేస్తున్నాడు. అతనికి క్షుణ్ణంగా ఏ స్విచ్, ఏ బటన్ ఎక్కడుందో తెలుసు. భయంలేదు. అతను ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నిస్తూ ఆలోచించసాగాడు.

తను కూర్చున్న గార్గా 3000 తన చుట్టూ తాను ప్రదక్షిణాలు చెయ్యకుండా స్థిమితంగా ఒకేచోట వుందంటే తాను ఏదో ప్లానెట్ మీద ఉన్నాడన్న మాట. నిశ్చయంగా ఆ గ్రహం శుక్రుడు కాదు. భూమి ఉపగ్రహమైన చంద్రుడూ కాదు. ఎందుకంటే ఆ రెండు చోట్లా ప్రజావాహిని గలగలకు తోడుగా, బిగువైన స్పేస్ సూట్లతో దీపాల వెలుగులో తిరుగుతూంటుంది. కనక ఇది వేరే గ్రహం. ఇంకా సాగుబడికి రాని గ్రహం.

అయినా అతనికి చింతలేదు. గార్గా 3000లోని ప్రతి భాగం స్క్రూనట్లతో సహా తనకి తెలుసు. చీకట్లో నయినా తడుముకోకుండా తను దీనిని మరమ్మతు చేసెయ్యగలడు.

అతడు చకచకా ఒక పద్ధతి ప్రకారం పనిచేసుకు పోతున్నాడు. కాలు విపరీతంగా బాధ పెడుతోంది. అయినా అతడు పట్టించుకోకుండా తన పని చేసుకు పోతున్నాడు. ఇంతలో ఏదో గుర్తుకొచ్చినవాడిలా టక్కున ఆగాడు.

ఒళ్లొక్కసారి జలదరించింది. జేబులో ఒకే ఒక్క ఆక్సోజిల్ ఉంది. అది కరిగిపోయిన కొద్దిసేపటిలో ఊపిరి అందక గిలగిలా కొట్టుకొని...

అతడు తల విదిలించి ప్రస్తుతానికి వచ్చి ముందుకన్నా వేగంగా చేతులతో తడుముకుంటూ పని చెయ్యడం ప్రారంభించాడు.

రెండు గంటల తీవ్రమైన పరిశ్రమ తరువాత స్పేస్‌షిప్ గార్గా 3000 గాలిలోకి లేచింది.

ఉదయ్ చేతులు ఒణుకుతున్నాయి. ఇంకో పది నిముషాలలో కనక తను భూమిని చేరుకోకపోతే ఇవే తనకు చివరి నిముషాలు అని తెలిసిపోయింది.

జేబు తడుముకు చూసుకున్నాడు. ఆక్సీజిల్ పూర్తిగా కరిగిపోయింది. మహా అయితే ఇంకో అయిదు నిముషాలుపాటు అతనికి సరిపోతుంది.

అతను ఒకసారి ఊపిరి పీల్చుకుని ఎంతసేపు వీలయితే అంతసేపు విడిచి పెట్టకుండా ఊపిరి బిగబట్టి నిశ్వాసించడం ప్రారంభించాడు. ఇలాగయితే కొంత సమయం ఆదా చేయవచ్చునని అతని ఉద్దేశ్యం.

గార్గా వేగంగా వినువీధుల్లో పయనిస్తోంది.

చుట్టూ దట్టమయిన చీకటి నక్షత్రాలు ఎక్కడో మినుకుమినుకుమంటున్నాయి. అతను ఉఛ్వాస నిశ్వాసాలు పద్ధతి ప్రకారం చేస్తూనే ఉన్నాడు. క్షణాలు దొర్లిపోతున్నాయి.

నక్షత్రాలు సీరియల్ సెట్లో బల్బుల్లా ఆరారి వెలుగుతున్నాయి. బాధ మరచిపోవడానికి సన్నగా మనసులో పాడుకోవడం ప్రారంభించాడు.

*చుక్కల్లో చుక్క! చక్కని చుక్క!*
*జిలిబిలి తారక వయ్యారి మొలక!*
*జాబిలేడీ అక్క! ఆ ప్రక్క ఈ ప్రక్క!*

చప్పున మనసులో పాట ఆగిపోయింది.

అవును. ఏడీ చందమామ?

వేరే ఈజ్ ది మూన్.

అతనికి స్పృహ పోయినంత పనయింది.

టి.వి. స్క్రీన్ ఆన్‌చేసి చూశాడు. అంతటా నక్షత్రాలు మెరుస్తున్నాయి.

తను దారితప్పి ఎక్కడికో పోతున్నాడా? ఇంకో గ్రహాన్ని కనుక్కుంటే నోబెల్ బహుమతిస్తారు తనకు. ఓ గాడ్!... బహుమతినందుకోవడానికి తనకి పెళ్లాం పిల్లలన్నా లేరే!

గార్గాని తన చుట్టూ తనని గిరికీలు కొట్టించాడు! అదిగో అక్కడ బ్లూ డైమండ్‌లా మెరుస్తూ...

భూమిని కనుక్కోగలిగితే అక్కడే చంద్రుడంటి పెట్టుకునే ఉంటాడు. గార్గాని ఆ దిక్కుగా పరుగులు తీయించాడు.

విరిగిన కాలు విపరీతంగా నొప్పి పెడుతోంది. ఊపిరి తీసుకోవడం మరీ కష్టంగా ఉంది.

క్షణాలు దొర్లిపోతున్నాయి. వేగంగా...

***ఉపసంహారం***

ఎంతసేపు గడిచిందో తెలియదు. ఉదయ్‌కి తల మీద ఉన్న ఆక్సిజన్ మాస్క్ చింపెయ్యాలనే కోరిక బలంగా ఉంది. గాలి అందక ఊపిరితిత్తులు బ్రద్దలయే లాగున్నాయి. అతనెంతో నిగ్రహంగా ఉండాలని ప్రయత్నిస్తున్నాడు.

ధడ్‌మనే చప్పుడుతో ఆగింది స్పేస్‌షిప్ గార్గా 3000. చివరి క్షణాలు లెక్కపెట్టుకుంటున్న ఉదయ్ నెమ్మదిగా కళ్లు తెరచి స్క్రీన్ వంక చూశాడు.

వెంటనే పిడుగులు పడ్డట్టుగా గట్టిగా అరిచి తన తలమీద ఉన్న ఆక్సిజన్ మాస్క్ చింపిపారేశాడు. అదే చేత్తో తన శరీరాన్ని అంటి పెట్టుకొని ఉన్న స్పేస్‌సూట్‌ని తీసివేశాడు.

ఇదే అతను కొద్దిసెకన్లు ముందుగా చేసి ఉంటే అతని శరీరం ముక్కలు స్పేస్‌షిప్‌తో సహా స్వర్గానికి చేరుకునేవి.

విరిగిన కాలు విపరీతమైన బాధపెడుతోంది. అయినా అతడు లెక్కచేయలేదు.

అతనికి తెలుసు.

గార్గా 3000 తలుపు ఒక్క తన్నుతో తెరుచుకుంది. ఉదయ్ తన ఆరడుగుల మూడంగుళాల శరీరంతో గార్గాలోంచి క్రిందకి గెంతాడు.

బూట్లు లేని కాళ్లకి చల్లటి ఇసుక హాయిగా తగిలింది. ఇంకా ఇంకా తన శరీరాన్ని ఆ ఇసుకలోకి నొక్కుకున్నాడు. గుప్పెడు ఇసుక తీసుకుని నెత్తి మీద పోసుకున్నాడు. ఒక్కసారి మనసంతా తేలికై నిద్రపోవాలన్నట్లు కళ్లు మూసుకుపోతున్నాయి.

ఎదురుగుండా సముద్రం. తెల్లటి పావురాల రెక్కల్లాంటి నురగల కెరటాలతో ఎప్పుడూ ఎగిరిపోతుండే నీలాల సాగరం.

అమావాస్య ముగిసి అప్పుడే తెల్లవారబోతున్నట్లుంది. ఏదో గూట్లోంచి చిన్న పిట్ట కిచకిచమని అరుస్తోంది. తెలుపు నలుపుల కలనేత ఆకాశం బ్యాక్‌గ్రౌండ్‌లో కొబ్బరాకులు పెన్సిల్ గీతల్లా కదులుతున్నాయి.

సముద్రం, ఆకాశం కలిసే చోటు నుంచి, నిద్ర లేచిన సూర్యుడు ఎర్రటి ముఖంతో పైకొస్తున్నాడు. రేగిన జుట్టులా కిరణాలు ఆకాశమంతా పరుచుకుంటున్నాయి.

తల క్రింద చేతులు పెట్టుకుని అతను ఆకాశం వంక చూస్తూ వెల్లకిలా పడుకున్నాడు.

మనిషి తెలివితేటలమీద అతడికిప్పుడు నమ్మకం పోయింది.

పూర్తిగా!

*ఉదయం వారపత్రిక, 7 డిశెంబర్ 1990*